సమర యాత్రను జయప్రదం చేయండి

ఏలూరు:బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ముఖ్యకార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లెనిన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య, ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన బస్సుయాత్ర ఈనెల 31వ తేదీన ఏలూరుకు చేరుతుందన్నారు. ఈ సందర్భంగా ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో జరిగే సభను జయప్రదం చేయాలన్నారు. ప్రధాని మోడీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. అలాగే రాష్ట్రంలో అధికారంలోకొస్తే ప్రతిసంవత్సరం జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలు కల్పిస్తామన్న సిఎం జగన్ ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

పల్లెబాటలో కొత్తనేతలు

సేవా కార్యక్రమాల పేరిట హడావుడి

ఎన్నికల్లో టిక్కెట్, ఆపై గెలుపే లక్ష్యంగా వ్యూహాలు

ఆయా పార్టీల్లో పెరుగుతున్న అంతర్గత పోరు

ప్రజాశక్తి - పశ్చిమ డెస్క్

సార్వత్రిక ఎన్నికలకు మరో సంవత్సరం గడువుంది. మారుతున్న రాజకీయ పరిణామాలతో ముందస్తు ఎన్నికలు వచ్చే అవకాశం ఉందనే ఊహాగానాలు పెద్దఎత్తున సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఆయా పార్టీల నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, ఆశావహులు అధిష్టానం వద్ద టిక్కెట్ల కోసం తమ ప్రయత్నాలు పెద్దఎత్తున సాగిస్తున్నారు. అయితే అదే సమయంలో అటు అధిష్టానంతోపాటు ఇటు జనాన్ని ప్రసన్నం చేసుకునేందుకు, ప్రధానంగా గ్రామాల్లో తమకు అవసరమైన కేడర్‌ను తమ వైపు తిప్పుకునేందుకు కసరత్తు చేస్తున్నారు. అదే సమయంలో ఆయా నియోజకవర్గాలకు చెందిన ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన ప్రముఖులు వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగేందుకు సన్నద్ధమవుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, ముంబై వంటి నగరాలతోపాటు ఇతర దేశాల్లో స్థిరపడిన కొందరు తాజాగా తమ కార్యకలాపాలు స్థానికంగా ప్రారంభిస్తున్నారు. వృద్ధులకు దుస్తుల పంపిణీ, ఏదైనా అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, ప్రమాదాల బారిన పడిన వారికి ఆర్థిక సాయంతోపాటు స్థానికంగా జరుగుతున్న కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందిస్తూ ఆయా కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఫోకస్ అయ్యే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా తమ పేరిట గాని, తమ పెద్దల పేరిటగాని సంస్థలు, ట్రస్టులు వంటి వాటి పేరిట ఈ కార్యక్రమాలు సాగిస్తూ జనానికి దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుండటంతోపాటు కొంతమంది యువతను తమ వెంట తిప్పుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇది అధికార పక్షమైన వైసిపికన్నా ప్రతిపక్ష టిడిపి, జనసేనల్లోనే ఎక్కువగా ఉంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని నూజివీడు, చింతలపూడి, తాడేపల్లిగూడెం, నరసాపురం నియోజకవర్గాల్లో టిడిపి తరపున పోటీ చేసేందుకు ఆయా ప్రముఖులు రంగం సిద్ధం చేసుకునే ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. ఉండి మాజీ ఎంఎల్ఎ వేటుకూరి వెంకట శివరామరాజు మళ్లీ శివ స్వచ్ఛంద సంస్థ పేరిట కార్యక్రమాలు ప్రారంభిస్తానని ఇటీవల జరిగిన తన పుట్టిన రోజు వేడుకల్లో ప్రకటించిన సంగతి తెలిసిందే. గతంలో ఆయన నరసాపురం ఎంపీ స్థానానికి టిడిపి నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తర్వాత కొంతకాలం స్తబ్ధతగా ఉన్న శివ ఇటీవల నియోజకవర్గంలో తన కార్యకలాపాలు ముమ్మరం చేశారు. అయితే ఇక్కడ సిట్టింగ్ ఎంఎల్ఎ మంతెన రామరాజు శివకు వరుసకు సోదరుడు. మరి రామరాజును కాదని శివకు టిడిపి అధిష్టానం ఎంఎల్ఎ టిక్కెట్ ఇస్తుందా లేక శివ వేరే పార్టీ నుంచి బరిలోకి దిగే అవకాశం ఉందా అనేది చర్చనీయాంశమైంది. ఇప్పటికే అధికార పార్టీ శివకు టిక్కెట్ ఇస్తామని ఆఫర్ ఇచ్చి పార్టీలో చేర్చుకోవాలని కొందరు నేతలు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. అయితే ఇదే నియోజకవర్గంలో స్వగ్రామంలో ఉన్న మాజీ మంత్రి ఒకరు తన కుమారునికి టిక్కెట్ ఇప్పించుకోవడం కోసం శివ చేరికను అడ్డుకుంటున్నట్లు తెలుస్తోంది.

మొత్తానికి ఎన్నికలు సమీపించేసరికి ఇక్కడ రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయో అంతుచిక్కని పరిస్థితి ఉంది. నరసాపురంలో మాజీ ఎంఎల్ఎకు, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికి పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేలా విబేధాలున్నాయి. ఈ పరిస్థితుల్లో ఒక ప్రముఖుడు టిక్కెట్ కోసం తన సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారనే ప్రచారం సాగుతోంది. ఇక అధికార పార్టీ వైసిపి టిక్కెట్ల కోసం కొందరు అధికారులు తెరవెనుక ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా చింతలపూడి నియోజకవర్గంలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. అయితే టిక్కెట్ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నా జనం వైపు మాత్రం ఈ అధికారులు పెద్దగా దృష్టి సారించడం లేదని తెలుస్తోంది. అలాగే నూజివీడు, పోలవరం, ఆచంట తదితర నియోజకవర్గాల్లో జనసేన తరపున పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతున్న కొందరు ఆశావహులు సేవా కార్యక్రమాలు ముమ్మరం చేశారు. మొత్తంగా ఎన్నికలకు సంవత్సరం సమయం ఉన్నా సేవా కార్యక్రమాలతో ప్రముఖుల సందడి, ఇటు అధికార పార్టీ నేతల గడపగడపకూ మన ప్రభుత్వం, అటు టిడిపి నేతలు వివిధ కార్యక్రమాలతో గ్రామాల్లో రాజకీయాలు క్రుపీ వేడెక్కుతున్నాయి.

మాజీ మంత్రి వట్టి కన్నుమూత

వసంత్‌కుమార్ (ఫైల్‌ఫోటో)

స్వగ్రామం ఎంఎంపురంలో అంత్యక్రియలు

నివాళులర్పించిన పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నేతలు, ప్రముఖులు



భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

అంత్యక్రియలు

ప్రజాశక్తి - ఉంగుటూరు, భీమడోలు

మాజీ మంత్రి, ఉంగుటూరు మాజీ ఎంఎల్ఎ వట్టి వసంత్‌కుమార్ (70) ఆదివారం తెల్లవారుజామున విశాఖపట్నంలోని అపోలో ఆసుపత్రిలో కిడ్నీ సంబంధిత ఇబ్బందులకు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మరణించారు. ఆయన భౌతికకాయాన్ని ప్రత్యేక అంబులెన్స్‌లో సొంతూరు భీమడోలు మండలం పూళ్ల పంచాయతీ పరిధి ఎంఎంపురానికి ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు తరలించారు. అప్పటికే ఆయనకు నివాళు లర్పించేందుకు మంత్రులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు అభిమానులు, కార్యకర్తలు తదితరులు వసంత్‌కుమార్ ఇంటి వద్దకు చేరుకున్నారు. సాయంత్రం వరకూ ప్రముఖుల సందర్శనార్థం భౌతికకాయాన్ని ఇంటి వద్దే ఉంచారు. వసంత్‌కుమార్ భౌతికకాయానికి శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, పిసిసి మాజీ అధ్యక్షులు కె.రఘువీరారెడ్డి, మాజీ ఎంపీలు ఉండవల్లి అరుణ్‌కుమార్, కెవిపి.రామచంద్రరావు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని, ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, కాంగ్రెస్, వైసిపి నాయకులు పెద్దసంఖ్యలో నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున మంత్రి దాడిశెట్టి రాజా విచ్చేసి నివాళులర్పించారు. అనంతరం వసంత్‌కుమార్‌కు చెందిన వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. స్వగృహం వద్ద నుంచి వసంత్‌కుమార్ భౌతికకాయాన్ని పోలీసు కవాతు నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లారు. అంతిమయాత్రలో గ్రామస్తులు, అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు. వసంత్‌కుమార్‌కు పిల్లలు లేకపోవడంతో సోదరుడి కుమారుడు పవన్ తలకొరివిపెట్టారు. పోలీసులు గౌరవసూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి అంబటి రాంబాబు, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, డిసిసిబి మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు, సినీ నిర్మాత అల్లు అరవింద్, క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి సర్రాజు, మాజీ ఎంఎల్ఎ కొండ్రెడ్డి విశ్వనాథం, ఈలి నాని, పసల కనకసుందర్రావు, జనసేన నేత పత్సమట్ల ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

వసంతకుమార్ జీవన ప్రస్థానం

భీమడోలు మండలం పూళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని ఎంఎంపురానికి (మల్కీ మహ్మద్‌పురం) చెందిన వట్టి వెంకట రంగ పార్థసారథి, వాసుకీదేవి దంపతుల ద్వితీయ కుమారుడు వట్టి వసంతకుమార్. ఆయన అన్న రమేష్‌నాయుడు హైదరాబాద్, విశాఖపట్నం నగరాల్లో వ్యాపారవేత్తగా ఉన్నారు. 1953లో పుట్టిన ఈయన ఆంధ్రప్రదేశ్ అటార్నీ జనరల్ తలారి అనంతబాబు కుమార్తె ఉమాదేవిని వివాహం చేసుకున్నారు. ఎనిమిది సంవత్సరాల క్రితం ఆమె చనిపోయారు. బిఎస్‌సి (అగ్రికల్చర్), ఎంబిఎ చదివిన వసంతకుమార్ 1974-75 సంవత్సరాల్లో ఆంధ్రా యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పని చేశారు. 1973-76 మధ్య యూత్ కాంగ్రెస్ కన్వీనర్‌గా పని చేశారు. 1989-90 సంవత్సరాల మధ్య అప్పటి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లు రవి కార్యవర్గంలో సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. కేంద్ర వాణిజ్య శాఖ ఆధ్వర్యంలో పని చేసే మెరైన్ ప్రొడక్ట్స్ విభాగంలో జాతీయ డైరెక్టర్‌గా 1985-88 మధ్య పని చేశారు. ఆ తర్వాత ఈ ఆక్వా ఫారం డెవలప్‌మెంట్ అధ్యక్షులుగా 1990 నుంచి 98 వరకు పని చేశారు. ప్రస్తుతం ఎపి ఆక్వా ఫార్మ్ డెవలప్‌మెంట్ విభాగం గౌరవాధ్యక్షులుగా కొనసాగుతున్నారు. 2004లో తొలిసారిగా ఉంగుటూరు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి టిడిపి అభ్యర్థి గన్ని వీరాంజనేయులపై విజయం సాధించారు. 2009లో కాంగ్రెస్ పార్టీ తరపున ఎంఎల్ఎగా మరోసారి ఇదే నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, కొణిజేటి రోశయ్య మంత్రివర్గాల్లో గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా, ఆ తర్వాత కిరణ్‌కుమార్ మంత్రివర్గంలో పర్యాటక, క్రీడా శాఖ మంత్రిగా పని చేశారు.

జిల్లా రాజకీయాల్లో చెరగని ముద్ర వేసిన వసంత్‌కుమార్

అంతిమయాత్ర

వట్టి వసంత్‌కుమార్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుప్రసిద్ధ రాజకీయ కుటుంబానికి చెందినవారు. వారి తాత పసల సూర్యచంద్రరావు జిల్లా రాజకీయాల్లో కొన్ని దశాబ్దాలపాటు కీలక భూమిక పోషించారు. 1952లో అల్లంపురం నియోజకవర్గం నుండి ఎంఎల్ఎగా ఎన్నికై ఆంధ్రరాష్ట్ర శాసనసభ ఉప సభాపతిగా పని చేశారు. వసంత్‌కుమార్ తండ్రి వట్టి వెంకటరంగ పార్థసారథి జిల్లాలో సీనియర్ రాజకీయవేత్త. కాంగ్రెస్ పార్టీ నేతగా, డిసిసిబి ఛైర్మన్‌గా సేవలందించారు. సమావేశాలకు హాజరు కావడంలో వసంత్‌కుమార్ సమయపాలన కచ్చితంగా పాటించేవారు. రాష్ట్ర విభజన అనంతరం రాజకీయాలకు దూరంగా ఉన్నారు.

డిప్యూటీ సిఎం కొట్టు సంతాపం

తాడేపల్లిగూడెం: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయాల్లో సుదీర్ఘకాలం వసంత్‌కుమార్ విశేష సేవలందించారని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా జిల్లా అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. వసంత్ మృతితో తాను వ్యక్తిగతంగా మంచి మిత్రుడిని కోల్పోయానని విచారం వ్యక్తం చేశారు. జిల్లా రాజకీయాలకు ఆయన మృతి తీరని లోటని నివాళు లర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

మంత్రి కారుమూరి సంతాపం

తణుకు: మాజీ మంత్రి వట్టి వసంత్‌కుమార్ మృతి పట్ల రాష్ట్ర పౌర సరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఆయన అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. తన రాజకీయ జీవితానికి పునాది వేసింది వసంత్‌కుమార్ అని, ద్వారకాతిరుమల నుంచి జెడ్‌పిటిసిగా పోటీ చేయడానికి ప్రోత్సహించి జెడ్‌పి ఛైర్మన్ పదవి కట్టబెట్టారని తెలిపారు. వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వసంతకుమార్ మృతికి సిపిఎం సంతానం

ఏలూరు:మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతికి సిపిఎం జిల్లా కమిటీ తరపున పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. వట్టి వసంతకుమార్ కిడ్నీ మార్పిడితో కొంతకాలంగా అనారోగ్యంగా బాధపడుతూ పరిస్థితి విషమించి కన్నుమూయడం బాధాకరమన్నారు.

గణపవరం:మచ్చలేని మహామనిషి వట్టి వసంతకుమార్ అని గణపవరం కన్యకా పరమేశ్వరి వర్తక సంఘ భవనం అధ్యక్షులు, రుద్రరాజు ఫౌండేషన్ ఛైర్మన్ ఆర్‌విఎస్.రాజు అన్నారు. సంఘ భవనంలో ఆదివారం ఆయన సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనను ఆశ్రయించి వచ్చిన ప్రతిఒక్కరికీ సాయం చేసేవారన్నారు. ఉమ్మడి రాష్ట్ర మంత్రిగా ఉంగుటూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వర్తకసంఘ భవనం ఉపాధ్యక్షులు వంకాయల రామారావు, కార్యదర్శి నడింపల్లి రాంపండు పాల్గొన్నారు.

ఏలూరు టౌన్:మాజీమంత్రి వట్టి వసంతకుమార్ మృతికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్ ఆదివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వసంతకుమార్ నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. కుటుంబ సభ్యులకు, ఆయన తండ్రి వెంకటరంగ పార్థసారధికి, ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.



నివాళులర్పిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు, జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, మంత్రి అంబటి రాంబాబు

వసంత్‌కుమార్ కుటుంబ సభ్యులకు ప్రముఖుల పరామర్శ

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పున:ప్రారంభించాలి



మాట్లాడుతున్న నారపల్లి రమణారావు

ప్రజాశక్తి - ఏలూరు

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను నిలిపివేస్తూ ఎపి ప్రభుత్వం ఇచ్చిన మెమో 1214ను రద్దు చేయాలని, పథకాలను పునరుద్ధరించాలని, దారిమళ్లించిన నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్‌వి.నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయడం శూన్యమన్నారు. వందల కోట్ల రూపాయలు బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు నిధులున్నప్పటికీ కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం పూనుకోవడం లేదని విమర్శించారు. సంక్షేమ బోర్డు నిధులను ఇతర అవసరాల కోసం ఖర్చు పెట్టకూడదని చట్టంలో నిబంధన ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ అధికారులు దీనికి భిన్నంగా సుప్రీంకోర్టు తీర్పును కాదని వందల కోట్ల రూపాయలు గతంలో చంద్రన్న బీమాకు రూ.450 కోట్లు, ప్రస్తుతం వైసిపి ప్రభుత్వం వైఎస్ఆర్ బీమాకు రూ.830 కోట్లు పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ వారు రూ.400 కోట్లు తరలించుకుపోయారన్నారు. ఈ నిధులను తిరిగి బోర్డుకు జమ చేయాలని డిమాండ్ చేశారు. చట్ట ప్రకారం వెల్ఫేర్ బోర్డు నిధులను కేవలం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు. కార్మికులకు ఉపయోగపడే పథకాలను కొత్తగా ప్రవేశపెట్టాలని కోరారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత వారికి సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదన్నారు. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన క్లెయిమ్స్‌కు, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రమాదాల వల్ల చనిపోయిన వారికి బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. దీనిపై మూడేళ్లుగా అనేకసార్లు ప్రభుత్వానికి ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలిచ్చి ఆందోళన చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఈ క్రమంలో ఏప్రిల్ ఆరో తేదీన ఢిల్లీలో జరిగే ధర్నాలో భవన నిర్మాణ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం రాష్ట్ర కోశాధికారి కెవి.గోపాలరావు, ఎం.సుందర్‌బాబు, ఎర్రా రాంబాబు, పిల్లి నరసింహారావు, కొండలరావు, సూరిబాబు, పి.అనసూయమ్మ, వల్లేపల్లి నరసింహమూర్తి, మద్దుకూరి దొరయ్య, ఎస్‌కె.చాంద్ బాషా, సంపూర్ణమ్మ, లక్ష్మీనారాయణ, ఈశ్వరాయ బాలవెంకట్, షేక్ సిల్లర్ మాట్లాడారు. ఈ సమావేశంలో 20 జిల్లాల ప్రతినిధులు హాజరయ్యారు.

6 నుంచి మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు నగరపాలక సంస్థ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించాల్సిన రూ.ఐదు కోట్లకు పైగా బకాయిలు కోసం వచ్చేనెల ఆరో తేదీ నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని సిఐటియు, ఎఐటియుసి సంఘాలు నిర్ణయించాయి. సిఐటియు, ఎఐటియుసి అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సంయుక్త సమావేశం పవర్‌పేటలోని సిఐటియు కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భజంత్రీ శ్రీనివాస్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.జాన్‌బాబు, సిఐటియు జిల్లా నాయకులు బి.సోమయ్య మాట్లాడారు. కార్మికులకు రావాల్సిన బకాయి జీతాలు, బకాయి హెల్త్ అలవెన్సులు, పిఆర్‌సి ఏరియర్ల కోసం సమ్మె చేపట్టాలని సమావేశం నిర్ణయించిందన్నారు. వచ్చేనెల మూడు, నాలుగు తేదీల్లో మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నాలు నిర్వహిస్తామన్నారు. ఉభయ సంఘాలు ఐక్యంగా పోరాడాలని, దీనికి కార్మికులంతా సహకరించాలని సమావేశం కోరింది. ఈ సమావేశంలో ఉభయ సంఘాలకు చెందిన నగర నాయకులు లావేటి కృష్ణారావు, కారు దుర్గారావు, బంగారు వెంకటేశ్వరరావు, పి.విష్ణు, తానంకి జార్జి, ఎం.గోపి, పంతం నాగరాజు, ఎఐటియుసి నాయకులు బంగారు కృష్ణ, బంగారు దుర్గాప్రసాద్, పి.వంశీ, వై.శివకుమార్, డి.రాజేష్, డి.నాగబాబు పాల్గొన్నారు.

నేడు జగనన్న చేదోడు నగదు జమ

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్రవ్యాప్తంగా 3,30,014 మంది రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.330.14 కోట్ల ఆర్థిక సాయాన్ని సిఎం జగన్ సోమవారం విడుదల చేయనున్నారు. పల్నాడు జిల్లా వినుకొండ వేదికగా జగనన్న చేదోడు పథకం ద్వారా కంప్యూటర్ బటన్ నొక్కి లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నారు. ఇందులో భాగంగా పథకం కింద వరుసగా మూడో ఏడాది ఏలూరు జిల్లావ్యాప్తంగా 15,968 మంది రజక, నాయీబ్రాహ్మణ, దర్జీలకు రూ.15.96 కోట్ల ఆర్థిక సాయాన్ని సోమవారం అందించనున్నట్లు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. ఈ పథకం ద్వారా షాపులున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, దర్జీలకు ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది దుకాణాలున్న 9,420 మంది టైలర్లకు రూ.9.42 కోట్లు, 4,419 మంది రజకులకు రూ.4.42 కోట్లు, 2,129 మంది నాయీబ్రాహ్మణులకు రూ.2.13 కోట్ల లబ్ధి చేకూర్చనున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బాబూరావు

పట్టణ ప్రజలపై భారాలను తిప్పికొట్టాలి

ప్రజాశక్తి - ఏలూరు

పట్టణ ప్రాంత ప్రజలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేస్తున్న పన్నుల భారాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఉదయం పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సిపిఎం పట్టణ ప్రాంత కార్యకర్తల జిల్లా సమావేశం పార్టీ నగర కార్యదర్శి పళ్లెం కిషోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుండి పెట్రోల్, డీజిల్, గ్యాస్, విద్యుత్ ఛార్జీలు పెంచి పేదలపై భారాలు మోపుతుంటే, మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పన్ను, నీటి, చెత్త సేకరణ పన్నులు, ఆఖరికి ఏలూరు కార్పొరేషన్ వంటి చోట్ల శ్మశాన పన్ను కూడా వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా ఇస్తామని, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పిన బిజెపి రాష్ట్రప్రజలను ఘోరంగా మోసగించిందన్నారు. అయినప్పటికీ రాష్ట్రంలో ఉన్న ప్రధాన పార్టీలు వైసిపి, టిడిపి, జనసేనలు బిజెపితో లాలూచీ పడుతున్నాయన్నారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతూనే, వైసిపి, టిడిపి, జనసేన పార్టీల లొంగుబాటు విధానాలను ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పట్టణ జనాభా పెరిగిందని, వారి అవసరాలకు సరిపడు సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. ముఖ్యంగా పట్టణప్రాంత ప్రజల సమస్యలపై పోరాటాలు వేగవంతం చేయాలన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన ఏలూరు జిల్లాలో ఏలూరు మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు, నూజివీడు, జంగారెడ్డిగూడెం, మునిసిపాలిటీలుగా, చింతలపూడి నగర పంచాయతీగా ఉన్నాయన్నారు. అక్కడ స్థానికసంస్థల పాలకవర్గాలు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో విఫలమవుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక సంస్థల పరిపాలన స్వతంత్రతను దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. స్థానిక సంస్థలకు నిధులు మంజూరు చేయడం లేదన్నారు. పురపాలకవర్గాలు కూడా ప్రభుత్వ విధానాలపై తమ నిరసన తెలపాలని కోరారు. మరోపక్క కొన్ని మతోన్మాద శక్తులు, ప్రజల మధ్య మత చీలికలు తెస్తూ, ప్రజాసమస్యలు పక్కదారి పట్టిస్తున్నారన్నారు. అలాంటి మతోన్మాద శక్తులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తిచేశారు. ఇలాంటి సమయంలో సిపిఎం ఆధ్వర్యంలో రానున్నకాలంలో పట్టణప్రాంతాల్లో పోరాటాలు పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు, జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, నాయకులు హనుమాన్, సూర్యారావు, ఆర్‌విఎస్.నారాయణ, హైమావతి, పద్మాంజలి, జి.సూర్య కిరణ్, లెనిన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి 5శాతం నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి - ఏలూరు

కేంద్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని, మందులపై జిఎస్‌టి ఎత్తివేయాలని ఎపి మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్(సిఐటియు) రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్‌జివిడి.కృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక పవర్‌పేటలోని సిఐటియు నగర కార్యాలయంలో యూనియన్ వార్షిక సభ ఏలూరు బ్రాంచి యూనియన్ అధ్యక్షులు బివివి.సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో కృష్ణ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం చెబుతున్న మాటలు కోటలు దాటుతున్నాయి గానీ, పనులు మాత్రం గడపదాటడం లేదని విమర్శించారు. ప్రజలకు అత్యంత అవసరమైన విద్య, వైద్యం పేదలకు అందుబాటులోకి తీసుకురావడంలో విఫలమవుతున్నారన్నారు. కరోనా తరువాత ఆరోగ్యంపై ప్రజల్లో భయాందోళన పెరిగిందన్నారు. ఈ క్రమంలో వైద్యం కోసం ఎక్కువ ఖర్చు పెడుతున్నారన్నారు. దీంతో ప్రయివేటు ఆసుపత్రులు, ఫార్మా కంపెనీల దోపిడీకి అడ్డూఅదుపు లేకుండా పోయిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం నిధులు కేటాయిస్తే ప్రభుత్వ వైద్యరంగాన్ని బలోపేతం చేసి, పేదలందరికీ ఉచిత వైద్యం అందించవచ్చన్నారు. మెడికల్ రిప్స్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వివివిఎన్.ప్రసాద్ మాట్లాడుతూ రిప్రజెంటేటివ్‌లు తమ వృత్తితో పాటు సమాజంలో ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో పోరాడుతున్నారన్నారు. ప్రజారోగ్య వేదిక ద్వారా ప్రభుత్వ వైద్యం బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న అనేక మందికి రక్తదానం చేస్తున్నారన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై పోటాపోటీగా భారాలు వేస్తున్నాయన్నారు. ఇదే క్రమంలో కార్పొరేట్ సంస్థలకు కోట్లాది రూపాయల రాయితీలిస్తున్నారని మండిపడ్డారు. అనంతరం ఏలూరు కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు రవిచంద్ర, ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ ఎంవి.సదా శివరావు మాట్లాడారు. ప్రజలకు అత్యవసర మందుల ధరలు తగ్గించాలని, మందులపై జిఎస్‌టి ఎత్తి వేయాలని, వైద్యరంగానికి కేంద్రం ఐదు శాతం నిధులు కేటాయించాలని, ప్రభుత్వ వైద్యం బలోపేతం చేయాలని పలు తీర్మానాల ఆమోదించారు. ఈ సందర్భంగా యూనియన్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సభలో యూనియన్ కార్యదర్శి సిహెచ్.సీతయ్య, వైస్‌ప్రెసిడెంట్‌లు వై.దుర్గారావు, ఎం.ఉమామహేష్, జాయింట్ సెక్రటరీలు సురేష్, ఎస్‌కె.మొహిద్దీన్, ట్రెజరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు యధావిధిగా స్పందన

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 30వ తేదీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్ కార్యాలయాలు, మండల కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో 'స్పందన' కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబానికి గ్రామ మహిళా వాలంటీర్ రేణుక అండగా నిలిచింది. మండలంలోని రాఘవాపురం గ్రామంలో ఎస్‌సి కాలనీలో ఉప్పులూరి ఆనందరావు కొంతకాలం నుంచి పక్షవాతం వ్యాధితో బాధపడుతున్నారు. ఆ వీధిలో గ్రామ వాలంటీర్ రేణుక విషయం తెలుసుకుని ఆ వీధి పరిధిలో ఉన్నవారి దగ్గర నుంచి కొంత నగదు సేకరించి బాధిత కుటుంబానికి అందించారు. సేకరించిన రూ.తొమ్మిది వేలు బాధిత కుటుంబానికి ఆదివారం అందించారు.

నేడు చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

చేతివృత్తిదారులకు జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించి వృత్తిదారులను ఆదుకోవాలని చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు కోరారు. ఈ నెల 30న విజయవాడ గాంధీనగర్‌లోని రాఘవయ్య పార్క్ ఎదుట ఉన్న మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో నిర్వహించే చేతివృత్తిదారుల రాష్ట్ర సదస్సులో వృత్తిదారులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక పత్రికా సెంటర్లో ఆదివారం పిచ్చుక ఆదిశేషు నాయకత్వం ప్రతినిధి బృందం కర పత్రాలను పంపిణీ చేశారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రతి ఒక్కరూ నేత్రాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని లయన్స్ జోన్ ఛైర్పర్సన్ వంశీ ప్రతాప్ అన్నారు. ఆదివారం నారాయణపురం లయన్స్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. చేబ్రోలు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో నిడదవోలు లయన్స్ నేత్ర వైద్యశాల సిబ్బంది సేవలందించారు. గుణ్ణం బుల్లెబ్బాయి క్యాంప్ ఛైర్మన్‌గా వ్యవహరించారు. 110 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు శీతాల, సత్యనారాయణ, కార్యదర్శి ఆదపా శేఖరాణి, లయన్స్ సభ్యులు కరణం మాలతీరాణి, బొమ్మిడి అప్పారావు, రామిరెడ్డి వెంకటరెడ్డి, రోహిత్ నాయుడు పాల్గొన్నారు.


నివాసిత పేదలు

న్యాయం చేయండి మహాప్రభో..!

కల్వపూడి సత్రం నివాసితుల ఆవేదన

ప్రజాశక్తి - ముదినేపల్లి

తమ ఇళ్లకు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయండి మహాప్రభో అంటూ మండల పరిధిలోని కల్వపూడిసత్రం వద్ద రోడ్డు మార్జిన్‌లో నివాసముంటున్న 15 కుటుంబాల పేదలు అధికారులను వేడుకుంటున్నారు. ఆదివారం కల్వపూడి సత్రం వద్ద తమకు న్యాయం చేయాలంటూ కారే పానకాలరావు ఆధ్వర్యంలో నివాసితులు తమ ఇళ్లముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నివాసితులు మాట్లాడుతూ గత 50 ఏళ్లుగా ముదినేపల్లి మండల పరిధిలోని కల్వపూడి సత్రం వద్ద ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నామన్నారు. 165 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ ఇళ్లు ఖాళీ చేయాలంటూ కాంట్రాక్టర్ హెచ్చరిస్తున్నట్లు నివాసితులు చెబుతున్నారు. తమ ఇళ్లకు నష్ట పరిహారం చెల్లిస్తే తాము వెంటనే ఖాళీ చేస్తామని చెప్పినప్పటికీ వినడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలంటూ తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించామన్నారు. అయినప్పటికీ రెవెన్యూ అధికారులు స్పందించడంలేదంటూ నివాసితులు అగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 50 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నా తమకు నష్టపరిహారం చెల్లించకుండా వెంటనే ఖాళీ చేయమంటే ఎక్కడికి వెళ్లాలంటూ నివాసితులు వాపోతున్నారు. ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నేరాలు - ఘోరాలు

ఆటో బోల్తా.. భార్యాభర్తలకు స్వల్ప గాయాలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఆటోబోల్తా పడిన ప్రమాదంలో భార్యాభర్తలు స్వల్ప గాయాలపాలయ్యారు. ఏలూరు నుంచి తాడేపల్లిగూడెం వైపు కర్రల లోడుతో వెళ్తున్న ఆటో జాతీయ రహదారి ఉంగుటూరు - నాచుగుంట మధ్య అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న బేతా గాంధీ, అతని భార్య బేతా నాగమణి స్వల్ప గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బోల్తా పడిన ఆటోను హైవే రెస్క్యూ టీమ్ బయటకు తీసి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

బోల్తా పడిన ఆటో

నాటుసారా విక్రేత అరెస్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ కె.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని తెడ్లెం గ్రామానికి చెందిన నిమ్మల రాంబాబు నాటుసారా విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు ఆదివారం దాడి చేసి అతడిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్‌కుమార్ తెలిపారు.

హత్యకేసులో నలుగురు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్: ఈ నెల 27న ఏలూరులో జరిగిన ఆటో డ్రైవర్ హత్యకేసులో నలుగురు నిందితులను త్రీటౌన్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. సంబంధిత వివరాలిలా ఉన్నాయి. మృతుడు మాణిక్యాలరావు ఇంటివద్ద పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి మాణిక్యాలరావు, నరేష్ ఇరువురికీ పరిచయమైన ఒక స్నేహితుడు కూడా హాజరయ్యాడు. ఆ స్నేహితుడు మాణిక్యాలరావుతో 'నీ భార్యను నరేష్ దుర్భాషలాడుతున్నాడని' చెప్పాడు. వెంటనే మాణిక్యాలరావు ఫోన్‌చేసి ఆ వ్యక్తిని గట్టిగా అడటం గొడవకు దారితీసింది. ఈ గొడవను ఆధారంగా చేసుకుని శుక్రవారం రాత్రి ఈ కేసులో నిందితులుగా ఉన్న నలుగురు ఫైర్ స్టేషన్ సెంటర్‌కు వచ్చి మాణిక్యాలరావుతో గొడవకు దిగారు. దీనిపై ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకోవడంతో మాణిక్యాలరావును తీవ్రంగా కొట్టారు. దీంతో ఘటనా స్థలంలోనే మాణిక్యాలరావు మృతి చెందాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు దుగ్గిరాలకు చెందిన గొల్లా నరేష్, అతని సోదరుడు గొల్లా నవీన్, అదే ప్రాంతానికి చెందిన చింతలపూడి నాగార్జున, శనివారపుపేట ఇందిరానగర్‌కు చెందిన కోలా మణిని ఆదివారం అరెస్ట్ చేశారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మట్టి మఫియా.. ఎవరూ పట్టించుకోరయ్యా..!

మండవల్లిలో యథేచ్ఛగా మట్టి తరలింపు
ప్రభుత్వ ఆదాయానికి గండి
కానరాని మైనింగ్ శాఖ
పట్టించుకోని రెవెన్యూ శాఖ

మట్టిని తరలిస్తున్న టిప్పర్లు

ప్రజాశక్తి - మండవల్లి

ఇల్లు నిర్మించాలన్నా.. పరిశ్రమ నెలకొల్పాలన్నా.. రహదారి ఏర్పాటు చేయాలన్నా.. అందుకు కావాల్సిన ప్రధాన వనరు పూడిక మట్టి. పూడిక మట్టి అంటే గుర్తుకు వచ్చేది మండవల్లి. మండవల్లి ఎందుకు గుర్తుకువస్తుంది అని ఆశ్చర్యమా? ఎందుకంటే మట్టి కోసం అనుమతులు లేకున్నా ఇక్కడ చెల్లుబాటు అవుతుంది. ఇక్కడి గ్రామాల్లో చెరువులు తవ్వినా, మంచినీటి అవసరాల పేరుతో కొల్లేరులో నిబంధనలకు విరుద్ధంగా అక్రమ చెరువులు తవ్వినా అధికారులు ఎవరూ అడ్డుకోరు అనే నానుడి. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా సమయంలో కూడా ఈ మట్టి తరలింపును ఇక్కడి అధికారులు అడ్డుకోలేకపోయారు. దీంతో కైకలూరు నియోజకవర్గంలో వేలాది ఎకరాల పంట భూములు అనుమతులు లేకుండా వెంచర్లుగా మారిపోతున్నాయి. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు వేల కోట్ల రూపాయలు గుత్తేదారుల జేబుల్లోకి వెళ్లిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. సంవత్సరాల తరబడి ఇలా అక్రమంగా మట్టిని తరలించేస్తున్నారు. పూడిక మట్టి లేదనే సాకుతో 17 సంవత్సరాలుగా పేదల ఇళ్ల స్థలాలను మెరక చేయకపోవడం అధికారుల పనితీరును, కాసుల కక్కుర్తిని తేటతెల్లం చేస్తుందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు మట్టి తరలింపుపై దృష్టి సారించాలని, రాష్ట్రానికి ఆదాయం సమకూర్చడంలో మట్టి మూడో స్థానంలో ఉంటుందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

మండవల్లిలో మట్టి తరలింపు అనేది నిరంతర ప్రక్రియగా సాగుతోంది. అయితే రహదారి అభివృద్ధి పేరుతో గుత్తేదారుడు భారీ స్థాయిలో పెద్దపెద్ద టిప్పర్లను ఏర్పాటుచేసి మట్టిని తరలించేస్తున్నాడు. ఇటువైపు చూడకుండా రెవెన్యూ అధికారులకు గుత్తేదారుడు ముందుగానే ముడుపులు ఇచ్చినట్లు సమాచారం. కొర్లపాడులో 17 ఎకరాలు, లింగాలలోని మరో 17 ఎకరాల పచ్చని పంట భూముల్లోని మట్టిని అనుమతులు లేకుండా తవ్వేస్తున్నారు. అధికారులు అడ్డుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. దీంతో పచ్చని పంట పొలాలు చెరువులుగా మారిపోతున్నాయి. మట్టిని తరలిస్తున్న వాహనాలు వేగంగా తిరుగుతుండడంతో గ్రామాల్లో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన రహదారులు ధ్వంసమైపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వేగానికి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పేదల ఇళ్ల స్థలాల మెరక చేయడానికి మట్టి లేదని సాకు చెప్పడంతో ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు అందించినప్పటికీ చావలపాడులో సుమారు 300 మంది, మండవల్లిలో సుమారు 140 మంది ఇల్లు నిర్మించుకోలేక అద్దె ఇళ్లల్లో ఉంటూ అవస్థలు పడుతున్నారు. ఇళ్ల స్థలాల మెరక చేసేందుకు లేని మట్టి అభివృద్ధి పేరుతో తరలించేందుకు ఎక్కడి నుంచి వస్తుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ మట్టి మాఫియాపై దృష్టి సారించి, ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చేలా చేయడంతో పాటు పేదల ఇళ్ల స్థలాలు మెరక చేయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు. దీనిపై తహశీల్దార్ జనార్దన్‌రావును వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మాట్లాడుతున్న సర్పంచి కె.వెంకటరత్నం

ప్రజా సమస్యల పరిష్కారానికి 'మానవత' కృషి

ప్రజాశక్తి - గణపవరం

ప్రజా సమస్యల పరిష్కారానికి మానవత సంస్థ కృషి చేస్తుందని మానవత మండల కమిటీ అధ్యక్షులు వంకాయల రామారావు అన్నారు. మండలంలోని జల్లికొమ్మర ప్రాథమిక పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మానవత మండల కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మానవత రీజియన్ ఛైర్మన్ కకర్ల విజయకుమార్ మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఫ్రీజర్లు, శాంతి రథాలు ఏర్పాటు చేశామని చెప్పారు. రానున్న రోజుల్లో సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ మృతికి సమావేశం సంతాపం తెలిపింది. ఈ సమావేశంలో మానవత సంస్థ మండల కార్యదర్శి బుద్దాల పుల్లయ్య, కొమ్మర గ్రామ సర్పంచి కురెళ్ల వెంకటరత్నం, అడ్డాడ రామకృష్ణంరాజు, కె.సత్యనారాయణ మూర్తి, ఎం.చిరంజీవి, జె.సత్యనారాయణ, ఎం.పోతురాజు, ఎన్.రవితేజ, ఆవుల కృష్ణ పాల్గొన్నారు.

31న వడ్డేశ్వరంలో పాడి రైతుల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 31న గుంటూరు జిల్లా, వడ్డేశ్వరంలోని రైతు సంఘం రాష్ట్ర కార్యాలయం హాలులో పాడి రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు ఏపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ చెప్పారు. స్థానిక పవర్‌పేటలోని అన్నే భవనంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జరుగుతున్న పాడి రైతుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాడి రైతాంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. గేదెలు, ఆవులు చనిపోయినా ప్రభుత్వం నుంచి బీమా పరిహారం అందడం లేదన్నారు. పశువులకు వివిధ రోగాలు రావడంతో పాల దిగుబడి తగ్గిపోయిందని, ఆ రోగాలు నివారణకు తగిన పశు వైద్యం అందడం లేదన్నారు. గత మూడున్నర సంవత్సరాలుగా మినీ గోకులం షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిన లీటరు రూ.నాలుగు ప్రోత్సాహక వధకం ఇప్పటివరకు అమల్లోకి రాలేదన్నారు. ఈ రాష్ట్ర సదస్సులో పాడి రైతుల సమస్యలు చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, మినీ గోకుల షెడ్ల బిల్లు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో పాడి రైతులు ఆందోళనకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

పేదలకు బియ్యం, కూరగాయలు అందజేత

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని కృష్ణాపురంలో పేదలకు వైసిపి నాయకులు ఆదివారం బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. జెడ్‌పిటిసి సభ్యులు, గన్నవరం నియోజకవర్గ పరిశీలకులు సామంతపూడి బాల సూర్యనారాయణరాజు (సూరిబాబు) పుట్టిన రోజు సందర్భంగా మండలంలోని కృష్ణాపురం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు భుక్యా బేబు ఆధ్వర్యంలో 50 మంది పేదలకు బియ్యం, కూరగాయలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూరిబాబు ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భుక్యా బిగన్నాదం, రాములు పాల్గొన్నారు.


పేదలకు కూరగాయలు అందిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి - మండవల్లి

అరే....నేస్తం.... ఎలా ఉన్నావురా..... ఎన్నాళ్లయింది రా నిన్ను చూసి... అని పలకరించుకుంటూ ఆనందంగా ఆలింగనం చేసుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకుని పూర్వ విద్యార్థులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో సందడి చేశారు. 1994 -95లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయంగా కలుసుకొని తన చిన్ననాటి స్నేహితులతో ఆనందంగా గడిపారు. మూడు దశాబ్దాల తర్వాత ఆనాటి రోజుల్లో వారు చేసిన చిలిపి చేష్టలను ఆటపాటలను గుర్తుతెచ్చుకొని మనసారా నవ్వుకున్నారు. ఒకరినొకరి యోగాక్షేమాలు తెలుసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. అంకిత భావంతో క్రమశిక్షణతో విద్యాభివృద్ధులు నేర్పిన గురువులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని పూలమాలతో ఘనంగా సత్కరించి నూతన వస్త్రాలను మెమోంటోలను అందించారు. ఈ సందర్భంగా పలువురు గురువులు మాట్లాడుతూ విద్య నేర్పిన గురువులను గుర్తుపెట్టుకుని సాదారంగా ఆహ్వానించి ఈ విధంగా సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. మీరంతా నేటికీ నా కళ్లకు విద్యార్థుల్లాగానే ఉన్నారని పిల్లాపాపలతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించారు. అనంతరం కె.సూర్యారావు,, పి.లక్ష్మీనరసింహరెడ్డి, కె.కనకమహాలక్ష్మి, జానకి రామారావు, ఎల్ఎస్.భాస్కరరావు, ల్యాబ్ అసిస్టెంట్ ఎ.వెంకటేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండవల్లి, అప్పాపురం సర్పంచులు మెండ ఝాన్సీ, బుర్ల భోగేశ్వరరావు, ఎల్‌వి ప్రసాద్, కెపి.సురేష్, సతీష్, గణేష్, ముళ్లపూడి సత్తిబాబు, కెవివి.ప్రసాద్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు

ఫొటోగ్రాఫర్ అనిల్‌కు అండగా ఉంటా : ఎలిజా

జంగారెడ్డిగూడెం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విషమ పరిస్థితిలో ఉన్న స్థానిక ఫొటోగ్రాఫర్ అనిల్‌కుమార్ వైద్యానికి తగిన సహకారం అందిస్తామని ఎమ్మెల్యే ఎలిజా హామీ ఇచ్చారు. ఆదివారం స్థానిక పాత మున్సిపాలిటీ సచివాలయం వద్ద ఎంఎల్ఎను ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ మిక్సింగ్ యూనిట్ సభ్యులు కలిసి అనిల్‌కుమార్ వైద్యానికి సాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ సిఎం రిలీఫ్‌ఫండ్ కోసం ప్రయత్నిస్తామన్నారు. ఆసుపత్రి వైద్య ఖర్చులకు సంబంధించిన ఎస్టిమేట్ కాపీ ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఫొటోగ్రాఫర్స్ కాకర్ల రామచంద్రరావు, జంగారెడ్డిగూడెం ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సోమరాజు, సూరిబాబు, చండేశ్వరరావు, రాజు పవన్, వాసు, శ్రీను, ప్రసాద్, నాగసూరి, బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రగడవరంలో ఉచిత వైద్య శిబిరం

చింతలపూడి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రగడవరం పంచాయతీలో వైద్య శిబిరం నిర్వహించడం ఆనందదాయకమని సర్పంచి తొమ్మండ్రు భూపతిరావు అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ శిబిరంలో 250 మందికి వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు కె.సురేంద్రబాబు, చింతలపూడి సాయి స్ఫూర్తి ఆసుపత్రి జనరల్ మెడిసిన్ వైద్యులు పి.రామకృష్ణ, పిల్లల వైద్య నిపుణులు పి.రవీంద్రబాబు, గైనకాలజిస్ట్ ఆర్.భవ్య, ఆసుపత్రి మేనేజర్ శ్రీనివాస్ వైద్య సేవలందించారు. సాయిస్ఫూర్తి ఆసుపత్రి వారు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో మానవత చింతలపూడి శాఖ గౌరవ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, ఛైర్మన్ ఎ.అప్పారావు, వైస్ ఛైర్మన్ ఎం.శామ్యూల్, అధ్యక్షులు కె.నాగచిన్నారావు, జాయింట్ సెక్రటరీ బివిఎస్ఎన్.రాజు, ఎం.సత్తిబాబు, పి.సోమశేఖర్, కె.గాంధీ, ఎం.కృష్ణారెడ్డి, కె.సురేంద్రబాబు పాల్గొన్నారు.

వైసిపి విజయానికి సహకరించాలి : డిఎన్‌ఆర్

ముదినేపల్లి: వైసిపి ప్రభుత్వానికి పేదలు వచ్చే ఎన్నికల్లోనూ మద్దతు ఇవ్వాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వడాలి సచివాలయ పరిధిలోని పెదకామనపూడిలో ఆదివారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అధికారులతో కలిసి ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, జెడ్‌పిటిసి సభ్యులు ఈడే వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపిపిలు సునీత, రాధా, వైసిపి మండల కన్వీనర్ ఎం.ఏసుబాబు, పార్టీ శ్రేణులు, అధికారులు , ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

ముసునూరు: మండలంలోని గోపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ప్రధానోపాధ్యాయురాలు కె.పద్మ మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పి.సీతారామయ్య, లక్ష్మీ ప్రసన్న, వీరాంజనేయులు, పైడి శ్రీనివాసరావు, బి.సుకుమార్, రవివర్మ, జ్యోతిర్మయి, రఫీ, రామకృష్ణ ఘనంగా సన్మానించారు.

బిజెపి కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ఆర్ఎస్ఎస్ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేసుకునేందుకు హిందుత్వవాదంతో మత విద్వేషాలు పెంచిపోసిస్తూ ప్రజల మధ్య చీలికలు తెస్తుందని ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు కెవి.రమణ విమర్శించారు. ఆదివారం మినీ చికాగోగా పేరుగాంచిన నెల్లిమర్ల జ్యూటు ఉద్యమంలో పోలీసు కాల్పులతో అమరులైన ఐదుగురు అమరవీరుల 29వ వర్ధంతి సందర్భంగా స్థానిక బోసుబొమ్మ సెంటర్‌లో సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా కెవి.రమణ మాట్లాడుతూ దేశంలోని అన్ని సామాజిక తరగుతలపైనా బిజెపి ప్రభుత్వం దాడి చేస్తుందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలు, 44 కార్మిక చట్టాల రద్దు, నూతన విద్యావిధానం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, దళిత, ఆదివాసీ మహిళా చట్టాలలో జోక్యం ఇలా అన్నివర్గాల ప్రజలపై దాడి చేస్తుందని పేర్కొన్నారు. బిజెపి తన హిందుత్వ ఎజెండాను అమలు చేసుకునేందుకు రాజ్యాంగంలోని ప్రజాస్వామిక హక్కులను కూడా కాలరాస్తు రాజ్యాంగ వ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టియు నాయకులు తానిగడప వెంకటేష్, ఏలేటి దుర్గయ్య, కొత్తూరు శ్రీను, దోసూరి విరయ్య, మద్దిపాటి బంగారయ్య, కొడాలి సుబ్బారావు పాల్గొన్నారు.

వైద్యానికి సాయం చేయరూ..

సాయం కోసం కిడ్నీ రోగి వేడుకోలు

ప్రజాశక్తి - పోలవరం

ప్రాణాపాయ స్థితిలో రెండు కిడ్నీల సమస్యతో ప్రాణాలు కాపాడుకోవడానికి సాయశక్తులా ప్రయత్నం చేసి ఇక ఆర్థిక స్థోమత చాలక ఆపన్నుల ఆర్థికసాయం కోసం బోడిగూడేనికి చెందిన కలుం బాపిరాజు దీనంగా ఎదురుచూస్తున్నాడు. ఓ పేద గిరిజన కుటుంబంలో పుట్టినబాయన ఎంఎ వరకూ చదివాడు. ప్రభుత్వ ఉద్యోగం కోసం 45 ఏళ్ల వరకూ నానా అవస్థలు పడ్డాడు. ఎంత చదివినా వృద్ధాప్యంలో ఉన్న తల్లిని, భార్యను పోషించేందుకు కూలి పనులకు సైతం వెళ్లాడు. కష్టానికి ఫలితంగా గత కొంతకాలం క్రితం పంచాయతీ కార్యాలయంలో సహాయ కార్యదర్శిగా అవుట్ సోర్సింగ్ ఉద్యోగం వచ్చింది. ఐతే ఉద్యోగం వచ్చిన సంతోషం ఎంతో కాలం నిలువలేదు ఉద్యోగం వచ్చిన అతి తక్కువ కాలంలోనే కిడ్నీ సమస్యతో ఆస్పత్రి పాలయ్యాడు. ప్రస్తుతం కొయ్యలగూడెంలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రాణాలు కాపాడుకోవాలంటే ఖరీదైన వైద్యం, మందులు అవసరం. తన కొడుకుని ఎలాగైనా కాపాడుకోవాలని తల్లి, భార్య దాతలసాయం కోరుతున్నారు. సహాయం అందించే వారు 7780643946 నెంబర్‌కు ఫోన్ చేయాలని, లేదా బ్యాంకు ఎకౌంట్ నెంబర్ 11617972828కు సాయం అందించాలని కోరుతున్నారు.

చికిత్స ద్వారా కుష్టు నివారణ

ప్రజాశక్తి - ఏలూరు

కుష్టు వ్యాధిని చికిత్స ద్వారా నయం చేయొచ్చని, చికిత్స కోసం అనేక లెప్రోస్టాటిక్ ఏజెంట్లు అందుబాటులో ఉన్నాయని డిడిఆర్‌సి సంస్థ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ రాంబాబు చెప్పారు. ప్రపంచ లెప్రోసి క్యూర్డ్ పర్సన్స్ డే సందర్భంగా కేంద్ర ప్రభుత్వ అధీనం లోని సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ద్వారా ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ ఆధర్వంలో నిర్వహించబడుతున్న దివ్యాంగుల పునారావాస కేంద్రం (డిడిఆర్‌సి)లోని సాంకేతిక నిపుణులు బృందం ఆధ్వర్యంలో దెందులూరు మండలంలోని వేగవరంలోని డామియన్ లెప్రోసి సెంటర్‌లో ఆదివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం అందిస్తున్న సేవలు, రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమశాఖ ద్వారా అందిస్తున్న సేవల గురించి వివరించారు.

వ్యక్తి దారుణ హత్య

ప్రజాశక్తి - నూజివీడు

గుట్కా కోసం ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం ఓ వ్యక్తి దారుణ హత్యకు దారితీసింది. నూజివీడు రూరల్ మండలం సిద్ధార్థనగర్ సమీపంలోని కొత్తూరుతండా వద్ద ఆదివారం ఈ దారుణం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తూరు తండాకు చెందిన బాణావతు ఏసు అలియాస్ హిల్టే(25), అదే ప్రాంతానికి చెందిన పోరియా గుట్కా ప్యాకెట్ కోసం ఓ షాపు వద్దకు వెళ్లారు. అయితే అక్కడ ప్యాకెట్ తక్కువగా ఉండటంతో ఏసు ముందుగా ప్యాకెట్ కొనుగోలు చేశాడు. ఆ ప్యాకెట్ తనకు ఇవ్వాలంటూ పోరియా పట్టుబట్టాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం తలెత్తింది. ఈ తరుణంలో అప్పటికే పోరియా తన వద్ద ఉన్న కత్తితో ఏసును పలుసార్లు విచక్షణారహితంగా పొడిచాడు. దీంతో అతను అక్కడికక్కడే కుప్పకూలి ప్రాణాలు విడిచాడు. వెంటనే నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. మృతుని భార్య, కుమారుడు ఉన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. నూజివీడు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడు సైకో ప్రవర్తన కలిగిన వ్యక్తి అని, తన వద్ద కత్తి, ఇతర మారణాయుధాలు నిత్యం కలిగి ఉంటాడని స్థానికులు చెప్పడం విశేషం.

వైభవంగా శోభనాచల రథోత్సవం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

మాఘమాస రథసప్తమి సందర్భంగా ఆదివారం ఆగిరిపల్లి పురవీధుల్లో నిర్వహించిన శ్రీశోభనాచల స్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. ఈ కార్యక్రమానికి పలు గ్రామాల నుంచి వచ్చిన యాత్రికులు పోటెత్తారు.

In The Court Of The VIIth Addl. Family Judge :: Eluru
D.V.C.APPEAL : 332/2017

Between:
1) Kalakonda Bujjibabu and 2 others
...Appellants /Respondents
AND
2) Smt. Kalakonda Lakshmi Aparna
...Respondent /Complainants

1) Smt. Kalakonda Lakshmi Aparna, W/o. Bujjibabu, C/o. V.T.Ramakrishna, D.No. 20C-1-23, Power Pet Station Road, Power Pet, Eluru-534002, West Godavari District.
2) Kalakonda Yogeswara Venkata Narayana Sai, S/o. Bujjibabu, R/o. Ramachandra Rao Pet, Eluru-534002, W.G.Dt.

పై నంబరు అప్పీలులో రెస్పాండెంట్లు 1 మరియు 2 అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు ఎన్నిసార్లు పంపినా మీరు ఉద్దేశ్యపూర్వకంగా తీసుకొనకుండా కాలయాపన చేస్తున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు, వాదన నిమిత్తం **ది.01-02-2023వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీయొక్క ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

బి.వి.కృష్ణారెడ్డి
అడ్వకేట్, డో.నెం.25-3-10, ఏలూరు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు **కన్నూరి రత్నకుమారి, భర్త: నారాయణమూర్తి,** బల్లిపాడు, అత్తిలి మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. నా క్లయింటుకు సంబంధించి పబ్లిక నోటీసు జారీ చేయబడినది.

నా క్లయింటు కన్నూరి రత్నకుమారికి ఈ క్రింది షెడ్యూలు సెటిల్‌మెంట దస్తావేజుగా కన్నూరి నారాయణమూర్తి, కన్నూరి దుర్గ అనంత నాగప్రసాద్ మరియు కన్నూరి రామకృష్ణ సాయి మల్లారావు ద్వారా డాక్యుమెంటు నెం. 5276/2021న వ్రాసి యిచ్చినారు. ఆ డాక్యుమెంటుకు సంబంధించిన లింకు డాక్యుమెంటు తేదీ 08-04-2015న డాక్యుమెంటు నెం. 984/2015రు బల్లిపాడు నుండి అత్తిలికి మోటారు సైకిల్ పై ది.25-01-2023న వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన లేక ఎటువంటి అభ్యంతరములు ఉన్ననూ ఈ ప్రకటన ఇచ్చిన 7 రోజులలోపుగా ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

షెడ్యూలు హద్దులు

ప॥గో॥జిల్లా, అత్తిలి మండలం, అత్తిలి ఎస్.ఆర్.ఓ. పరిధి, బల్లిపాడు గ్రామ పంచాయితీ, రి.స.నెం. 183/1రు దాఖలా చ॥గ॥115లు సెంట్లు ఖాళీ నివేశ్న స్థలమునకు హద్దులు:
తూర్పు: కన్నూరి శోభనాద్రి గారి స్థలం.
పడమర: పంచాయితీ సిమెంటు రోడ్డు.
ఉత్తరం: కన్నూరి ప్రసాద్ గారి తాలూకు ఆస్థి.
దక్షిణం: ఆకుల రామకృష్ణ గారి స్థలం.

పమ్మి వి.నాగ వీరభద్రుడు
అడ్వకేట్, తాడేపల్లిగూడెం, ప॥గో॥జిల్లా.
సెల్: 77023 11197

PUBLIC NOTICE

This Public Notice is given on the instructions of My Client **Kannuri Ratna Kumari, W/o. Narayana Murthy** of Ballipadu Village, Attili Mandal, West Godavari District.

That my client has acquired the below mentioned schedule property under a Regd. Settlement Deed No. 5276/2021 executed by Kannuri Narayana Murthy, Kannuri Durga Anantha Naga Prasad and Kannuri Rama Krishna Sai Yallarao to that Document Link Document No. 984/2015 was Lost During My Client Travelling from Ballipadu to Attili by Two Wheeler on 25-01-2023. Therefore this Public Notice is issued to all that anybody has of the said Original Lost Documents / Claim / Right / Objection Over the schedule Property, they shall came forward with Documentary Proof within Seven (7) Days form the date of this Notice to the Undersigned, else if shall bw deemed that there are no Claims (or) Objections Over the Schedule Property, and the Transaction will be Proceeded with.

DOCUMENT SCHEDULE

West Godavari District, Attili Mandal, Ballipadu Village in R.S.No. 183/1 of Site 115 Sq. Yards following boundaries:
East: Site of Kannuri Sobhanadri.
South: Site of Akula Rama Krishna.
West: Panchayat Cement Road.
North: Property of Kannuri Prasad.
Within the boundaries site with all Easementary Rights.

PAMMI V.NAGA VEERABHADRUDU
Advocate, Tadepalligudem, W.G.Dist.
Cell: 77023 11197